
సాక్షి
అనంతపురం
శుక్రవారం। 3। ఫిబ్రవరి। 2023



జకినీమాతా నమోస్తుతే ..

దేశంలోని నలుమూలల నుంచి తరలివచ్చిన ఆరె కటికలతో గుత్తి, గుత్తి ఆర్ఎస్ పట్టణాలు కిక్కిరిసాయి. 8లో



కిలో టమాట రూ.20

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20 ప్రకారం ధర పలికింది.



జిల్లా అంతటా గురువారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వలంగా పెరిగాయి.

న్యూస్‌రీల్

కిక్ కొట్టినా స్టార్ట్ కావా?

- బైక్‌కు నిప్పుపెట్టిన వాహనదారుడు



కాలుతున్న ద్విచక్ర వాహనం

పుట్లూరు: ఎన్ని సార్లు కిక్ కొట్టినా స్టార్ట్ కావా..? అంటూ మద్యం మత్తులో ఉన్న వ్యక్తి తన ద్విచక్ర వాహనానికే నిప్పు పెట్టిన ఘటన మండల కేంద్రం సమీపంలో పుట్లూరు–గూడూరు రోడ్డుపై గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు.. మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన లక్ష్మీనారాయణ పుట్లూరులోని పెట్రోల్ బంక్ వద్ద తన ద్విచక్ర వాహనానికి పెట్రోల్ కొట్టించాడు. తన స్వగ్రామానికి వెళ్లామనుకున్న సమయంలో ద్విచక్ర వాహనం ఆగిపోయింది. ఎన్నిసార్లు కిక్ కొట్టినా స్టార్ట్ కాలేదు. విసిగిపోయిన లక్ష్మీనారాయణ మద్యం మత్తులో పెట్రోల్ ట్యాంక్ నుంచి పెట్రోల్ తీసి ద్విచక్ర వాహనంపై పోసి నిప్పంటించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీయగా తన మనసు బాగా లేకపోవడంతో తానే తన బైక్‌కు నిప్పు పెట్టానికి చెప్పారు.

నేడు మంత్రి కాకాని రాక

అనంతపురం అర్బన్: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం జిల్లాకు విచ్చేయనున్నారు. రాత్రి 8 గంటలకు అనంతపురం చేరుకుని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బస చేస్తారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆర్‌డీటీ ఇన్‌క్లూసివ్ హైస్కూల్‌లో నిర్వహించనున్న రాయలసీమ ఎఫ్‌ఈఓల సమావేశానికి హాజరవుతారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఇక్కడి నుంచి బయలుదేరి బెంగుళూరు వెళతారు.

రేపు రైతు ఉత్పత్తిదారు సంస్థల సమ్మేళనం

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాయలసీమ రైతు ఉత్పత్తిదారు సంస్థల సమ్మేళనాన్ని ఈ నెల 4న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఈ సమ్మేళనానికి రాయలసీమ జిల్లాల్లోని 120 ప్రగతిశీల రైతు ఉత్పత్తిదారు సంస్థల నుంచి 200 మంది సన్న, చిన్నకారు రైతులు హాజరవుతారన్నారు. వీరితో పాటు ఏపీ ప్రభుత్వ వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యాన, ఆహార, పరిశ్రమల నుంచి ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని రైతు ఉత్పత్తిదారు సంస్థల సుస్థిరతకు సలహాలను అందిస్తారన్నారు.

హనుమద్వాహనంపై కొండమీదరాయుడు



బుక్కరాయసముద్రం: కొండమీదరాయుని బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారు హనుమద్ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బీకేఎస్ పుర వీధులలో స్వామివారిని ఊరేగించగా భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం రాత్రి శ్రీవారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

సెల్ రోగం

ప్రస్తుత పరిస్థితుల్లో సెల్‌ఫోన్ లేకపోతే ఏ ఒక్క పని జరగని పరిస్థితి. సెల్‌ఫోన్ వల్ల జరిగే మంచిని అటుంచితే... ఇప్పటికే చాలామంది ఎక్కువగా మొబైల్‌ఫోన్లు వినియోగిస్తూ రకరకాల రుగ్మతల బారిన పడుతున్నారు. కంటిచూపు సమస్యతో కొందరు, గేమింగ్‌కు బానిసలై మరికొందరు, మానసిక సమస్యలతో కూడా ఎంతో మంది అవస్థలు పడుతున్నారు. తాజాగా 'టెక్స్ట్ నెక్ సిండ్రోమ్' (మెడకు సంబంధించిన నొప్పి) పట్టిపీడిస్తోంది.



- ఉరవకొండకు చెందిన ఓ యువతి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో బీటెక్ చదువుతోంది. తల ఓవైపునకు వంచినట్టు ఉందని బాధపడుతుంటే తల్లిదండ్రులు డాక్టర్‌కు చూపించారు. ఈమె ఎక్కువగా సెల్‌ఫోన్ వాడటం వల్ల ఇలా జరిగిందని న్యూరో వైద్యులు చెప్పారు. ఇప్పుడామె నొప్పి భరించలేక ఆక్యుపేషనల్ థెరఫీ చేయిస్తోంది.
- అనంతపురానికి చెందిన అనీల్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. అమెరికాలో కూడా పదేళ్లు పనిచేసి వచ్చారు. మొబైల్ ఫోన్ వాడకం పెరిగి ఆయనకు మెడనొప్పితో పాటు నడుమునొప్పి వచ్చింది. నగరంలోనే ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారు.



- మొబైల్స్‌ను అధికంగా వినియోగిస్తుండటంతో అనేక రుగ్మతలు
- పెరుగుతున్న 'టెక్స్ట్ నెక్ సిండ్రోమ్' బాధితులు
- గంటల తరబడి చూస్తుండటంతో దెబ్బతింటోన్న నాడీ వ్యవస్థ
- మేల్కోకపోతే ముప్పు తప్పదంటున్న వైద్యులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంత జిల్లాలో స్మార్ట్ ఫోన్ వాడుతున్న వారిలో ఎక్కువ మంది 'టెక్ట్స్ నెక్ సింద్రోమ్ 'కు గురవుతున్నట్లు తేలింది. దీనివల్ల మెడ వంకర్లు పోవడం, మెడనొప్పి రావడం, తలెత్తుకు తిరగలేకపోవడం జరుగుతోంది. ఆక్యుపేషనల్ సేఫ్టీ అండ్ ఎర్గానోమిక్స్ అనే జర్నల్ టెక్ట్స్ నెక్ సింద్రోమ్ పెద్ద భూతంలా వేధిస్తోందని వెల్లడించింది. ఈ సింద్రోమ్ కారణంగా నాడీ వ్యవస్థ దెబ్బతింటోందని వైద్యులు చెబుతున్నారు.

ఏమిటీ టెక్ట్స్ నెక్ సింద్రోమ్?

టెక్ట్స్ నెక్ సింద్రోమ్ అనేది వైరసో, బాక్టీరియానో కాదు. తదేకంగా సెల్‌ఫోన్‌ను వాడుతున్న వారికి వచ్చే ప్రత్యేక జబ్బు. స్మార్ట్‌ఫోన్లు వాడుతున్న వారిలో ఈ పరిణామాలు తీవ్రంగా ఉన్నాయి. ప్రధానంగా టెక్ట్స్ మెసేజ్‌లు ఎక్కువ సేపు చూస్తూండటం వల్ల మెడ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్లు తేలింది. దీంతో మెడ కండరాలు, నరాలు ఒత్తిడికి గురై నాడీ వ్యవస్థపై ప్రభావం చూపిస్తున్నాయి. దీనివల్ల విపరీతమైన తలనొప్పి, భుజాల నొప్పి రావడం, ఇది ఇలాగే కొనసాగి, తొడ నుంచి పాదం వరకూ జాలుగా నొప్పిరావడం వంటివి జరుగుతున్నాయి. నిద్రలేమి, మానసిక ఒత్తిడి కూడా ఎదుర్కొంటున్నారు.



ఉమ్మడి అనంత జిల్లాలో పరిస్థితి ఇలా...

స్మార్ట్‌ఫోన్ వాడకందారులు	14 లక్షలు పైగా
సగటున రోజూ సెల్‌ఫోన్ వాడుతున్న గంటలు	5 గంటలు
మొబైల్ ఎక్కువగా వాడుతున్న వయసు వారు	25-30 ఏళ్ల వారు
పాక్షికంగా మెడ సమస్యను ఎదుర్కొంటున్నది	40 శాతం మంది
తీవ్ర మెడనొప్పి ఎదుర్కొంటున్నది	10 శాతం మంది

టెక్ట్స్ నెక్ సింద్రోమ్ నుంచి బయట పడండిలా...

- రెండు, మూడు నిముషాలకు కంటే ఎక్కువగా మెడలు వంచి సెల్‌ఫోన్‌లో మెసేజ్‌లు చూడకూడదు.
- స్మార్ట్‌ఫోన్ వాడుతున్న వారు పదే పదే మెడను రొటేట్ అంటే కుడి నుంచి ఎడమకు ఎడమ నుంచి కుడికి తిప్పుతూ ఉండాలి.
- ప్రతి గంటకోసారి రెండు మూడు సార్లు తలను పైకెత్తి మళ్లీ కిందికి బలవంతంగా వంచాలి.
- మెసేజ్‌ను చదవాలనుకున్నప్పుడు కుర్చీలో వెనక్కు వాలి ఫోన్‌ను ముఖంపైకి తెచ్చుకుని చదువుకోవాలి.
- పెద్ద పెద్ద మెసేజ్‌లు ఉన్నప్పుడు అంతా ఒకేసారి చదవకుండా మధ్యలో విరామం తీసుకుని మెడ వ్యాయామం చేయాలి.
- రోజూ యోగాసనాలు చేస్తే కండరాలు, నరాల వ్యవస్థ సానుకూలంగా మారి నొప్పి నివారిణిగా పనిచేస్తుంది.

వ్యాయామమే పరిష్కారం



చాలామంది టెక్ట్స్ నెక్ సింద్రోమ్ గురై మెడనొప్పి తట్టుకోలేక పెయిన్ కిల్లర్స్ వాడుతున్నారు. ఇది కరెక్టు కాదు. దీని వల్ల తాత్కాలికంగా నొప్పి తగ్గచ్చుగానీ, భవిష్యత్‌లో ప్రమాదం ఎక్కువ. తలకు, మెడకు సంబంధించి వ్యాయామం మంచిది. యోగా వల్ల చాలా వరకు నొప్పిని నియంత్రించుకోవచ్చు.

– జి.నరేష్‌బాబు, మెడ, వెన్నుపూస వైద్య నిపుణులు

తక్కువ సేపు వాడాలి



మొబైల్ ఫోన్లు చిన్నతనం నుంచే అలవాటు పడిన చాలామంది పిల్లలు ఇప్పటికే దృష్టిలోపంతో బాధపడుతున్నారు. గంటల తరబడి ఫోన్ చూడటం వల్ల సున్నితమైన కంటికి సంబంధించి అవయవాలు దెబ్బతింటున్నాయి. వీలైనంత తక్కువ సేపు వాడటం మంచిది.

– పల్లంరెడ్డి నివేదిత, కంటివైద్య నిపుణురాలు

ఉచ్చులో ఇరుక్కుపోయారు



ఓ వైపు మెడనొప్పి, నడుమునొప్పులే కాదు.. రాత్రిళ్లు ఎక్కువగా మొబైల్ వాడి గేమింగ్, బెట్టింగ్‌ల కారణంగా వ్యసనాలకు లోనయ్యారు. నిద్రలేమి కారణంగా మెంటల్ కండీషన్ ఇన్‌బ్యాలెన్స్ అవుతోంది. చాలా మందికి చదువుమీద దృష్టి పోతోంది. మానసిక బలహీనతల వల్ల డ్రగ్స్ వైపు దృష్టి సారిస్తున్నారు.

– డా.విశ్వనాథరెడ్డి, మానసిక వైద్యనిపుణులు

సచివాలయ సేవలను వినియోగించుకోండి

- ఎస్పీ ఫక్కీరప్ప



శింగనమల గ్రామ సచివాలయంలో పోలీస్ సేవల గురించి తెలుసుకుంటున్న ఎస్పీ ఫక్కీరప్ప

శింగనమల: గ్రామ సచివాలయాల్లో పోలీస్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ ఫక్కీరప్ప తెలిపారు. గురువారం శింగనమల పోలీస్‌స్టేషన్, గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయంలో ఎంపీడీఓ నిర్మలాకుమారి, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, మహిళ సిబ్బందితో సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల సేవలను ఎన్ని రోజులలో పొందవచ్చో తెలియజేశారు. ఫిర్యాదు అందిన వెంటనే పరిష్కరించడానికీ సిబ్బంది కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సెల్‌ఫోన్ రికవరీ చేయడంలో జిల్లా మొదటి స్థానంలో వచ్చిందన్నారు. గ్రామ పంచాయతీల్లోనూ అక్కడక్కడా సీసీ కెమెరాలు ఏర్పాటుకు ఆయా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతామన్నారు. తాడిపత్రి, రాప్తాడు నియోజకవర్గాల్లో జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో పకడ్బందీగా చర్యలు చేపడతామన్నారు. ఎవరైనా ఘర్షణలకు, అసాంఘిక చర్యలకు పాల్పడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. అనంతరం కేసుల వివరాలను సీఐ అస్రార్ బాషా, ఎస్ఐ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు.

రెండు ఎంపీపీ స్థానాలకు నేడు ఎన్నికలు



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలో చెన్నేకొత్తపల్లి, విడపనకల్లు ఎంపీపీ స్థానాలకు శుక్రవారం ఎన్నికలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల్లోగా ఎంపీపీలుగా ఎవరు ఎన్నికైంది ప్రకటించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. విడపనకల్లు ఎంపీపీ పదవి జనరల్ మహిళకు కేటాయించగా, వేల్పుమడుగు ఎంపీటీసీ సభ్యురాలు నాగరత్నమ్మను ఎంపీపీగా ఎన్నుకున్న సంగతి తెలిసిందే. ఏడాది కాలం ఎంపీపీగా పని చేసిన ఆమె ఆ తరువాత పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఎంపీటీసీగా కొనసాగుతున్నారు. అలాగే, బీసీ మహిళకు రిజర్వ్ అయిన చెన్నేకొత్తపల్లి ఎంపీపీ పదవికి ప్రవీణ ఎన్నికయ్యారు. ఆమె కూడా ఇటీవల పదవికి రాజీనామా చేసి, నాగసముద్రం ఎంపీటీసీగా కొనసాగుతున్నారు. దీంతో రెండు మండలాల ఎంపీపీ పదవులకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థి ఎవరనేది గుర్తింపు పొందిన పార్టీల జిల్లా అధ్యక్షులు బీఫారం పంపుతారని సీఈఓ తెలిపారు. ఇప్పటికే అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బీ ఫారాలు పంపినట్లు సమాచారం. దాదాపుగా ఎన్నికల ప్రక్రియ ఏకగ్రీవంగా ముగియనుంది. పోటీ లేకపోవడంతో అధికార పార్టీ అభ్యర్థులే రెండు స్థానాల్లోనూ ఆశీనులు కానున్నారు. ఎంపీపీ ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

10 నుంచి సీఎం కప్ పోటీలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్), జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో ఈ నెల 10, 11 తేదీల్లో జిల్లా స్థాయి ఏపీ సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు అన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన క్రీడాకారులకు మొత్తం 14 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. జిల్లా స్థాయి పోటీలను ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానం, ఇండోర్ స్టేడియంలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 10న ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో అథ్లెటిక్స్, ఖోఖో, హాకీ, హ్యాండ్‌బాల్, టెన్నిస్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, 11న ఫుట్‌బాల్ పోటీలు జరుగుతాయన్నారు. 10న ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్, 11న కబడ్డీ, బాస్కెట్‌బాల్, టేబుల్‌టెన్నిస్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 08554–353223 నంబరును సంప్రదించాలన్నారు.

కరెన్సీ నోట్ల ఎగ్జిబిషన్



కరెన్సీ నోట్లు, నాణేలను తిలకిస్తున్న విద్యార్థులు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండింట్‌గా విధులు నిర్వహిస్తున్న నాగభూషణం తాను సేకరించిన 175 దేశాల కరెన్సీ నోట్లు, నాణేలతో గురువారం నిర్వహించిన ఎగ్జిబిషన్‌కు స్పందన లభించింది. ఎగ్జిబిషన్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరీ ప్రారంభించగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆసక్తిగా కరెన్సీ నోట్లు, నాణేలను పరిశీలించారు.

95 శాతం పింఛన్ పంపిణీ




పామిడి: కర్నూలులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాజేష్

అనంతపురం సెంట్రల్: జిల్లాలో రెండోరోజు గురువారం కూడా సామాజిక పింఛన్ పంపిణీ కొనసాగింది. మొత్తం లబ్ధిదారుల్లో 95.20 శాతం మందికి పింఛన్ అందజేశారు. ఈనెల మొత్తం 2,77,367 మందికి పింఛన్‌లు మంజూరుగా కాగా 2,64,052 మందికి సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేపట్టారు. 31 మండలాల్లో ఇప్పటి దాకా 95 శాతం పింఛన్ పంపిణీ పూర్తయింది. మరో రెండురోజుల్లో పింఛన్ మొత్తం పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి తెలిపారు.

నాగుతో చెలగాటం

- పాము కాటుకు గురైన యువకుడు



ఇంట్లోకి దూరిన పాము ఇదే


యాడికి: ఇంట్లో కనిపించిన పామును పట్టుకున్న ఓ వ్యక్తి పాము కాటుకు గురైన ఘటన కత్తిమానుపల్లెలో గురువారం చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బాలకృష్ణ ఇంటిలో నాగుపాము ఉందనే సమాచారం అందుకున్న అదే గ్రామానికి చెందిన ఆదిరెడ్డి పాము పట్టుకుని బయటకు వచ్చి డబ్బాలో వేసేందుకు యత్నించాడు. ఒక్కసారిగా అతడికి పాము కాటువేసింది. దీంతో అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తమ్ముళ్ల నీటి దందా!

- అక్రమంగా కెనాల్ నీరు డంపింగ్ చేస్తున్న టీడీపీ నాయకులు
- రైతులకు సరఫరా చేస్తూ దోపిడీ
- ఎకరాకు రూ.40 వేల దాకా వసూలు
- ఎమ్మెల్యే కేశవ్ అండదండలతో రెచ్చిపోతున్న వైనం
- పట్టించుకోని అధికారగణం

భూముల కబ్జాలు... పనులు చేయకపోయినా బిల్లులు .. పనిచేయాలంటే డబ్బులు డిమాండ్ చేయడం... వంటి అక్రమాలను తరచూ వింటూనో.. చూస్తూనో ఉంటాం. అయితే కొందరు తెలుగు తమ్ముళ్లు సరికొత్త దందాకు తెర తీశారు. చెరువు తరహాలో ఓ పెద్ద గుంతను తవ్వించేసి కెనాల్ నీటిని అక్రమంగా మళ్లించి ఆ నీటిని రైతులకు అమ్మేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.





జీబీసీ కాలవ నుంచి పైపుల ద్వారా నీటిని మళ్లిస్తున్న దృశ్యం, టీడీపీ నాయకుడు పాండురంగ పొలంలో తవ్విన భారీ గుంతలో నిల్వ ఉంచిన నీరు

విడపనకల్లు: మండల పరిధిలోని జనార్దనపల్లికి చెందిన టీడీపీ నాయకుడు పాండురంగకు గడేకల్లు, ఎస్ తిమ్మాపురానికి వెళ్లే రస్తాలో వ్యవసాయ భూమి ఉంది. ఈయన భూమికి పది మీటర్ల దూరంలోనే జీబీసీ (గుంతకల్లు బ్రాంచ్ కెనాల్) ఉంది. పాండు రంగ తన పొలంలో దాదాపు రెండు ఎకరాల్లో 20 అడుగుల లోతుతో చెరువును తలపించేలా పెద్ద గుంతను తవ్వించాడు. కెనాల్ నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా నీటిని అనధికారికంగా తాను తవ్వించిన పెద్ద గుంతలోకి నిరంతరాయంగా నీటిని మళ్లించుకుంటున్నాడు.

రైతుల పొలాల్లో దౌర్జన్యంగా పైప్‌లైన్

జనార్దనపల్లి, వేల్పుమడుగు గ్రామాలకు చెందిన నాన్ ఆయకట్టు భూములకు సంబంధించిన రైతులకు తాను నిల్వ చేసిన నీటిని మళ్లించి సొమ్ము చేసుకునే ప్రణాళిక రచించాడు. ఇందులో భాగంగానే చాలా మంది రైతుల పొలాల్లో నీటిని మళ్లించేలా దౌర్జన్యంగా పైప్‌లైన్ వేయించాడు. ఇదేమని ప్రశ్నించిన వారికి బెదిరించడంతో ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి.

అంతా జట్టుగా...

నీటి మళ్లింపు దందాకు సంబంధించి పాండురంగ... తెలుగుదేశం పార్టీకే చెందిన ముప్పారపు హరి, ముప్పారపు సుధాకర్, భట్టు సోమశేఖర్, మోదుపల్లి లోక్‌నాథ్, కావేటి, ముప్పారపు సోమనాథ్‌తో చేతులు కలిపారు. అందరూ జట్టుగా వచ్చిన డబ్బులను పంచుకున్నట్లు సమాచారం. వీరి పొలాల మీదుగా కూడా ఆ పైప్‌ను మళ్లించడంతో అందరూ ఒక్కటిపై నిలిచినట్లు తెలిసింది.

ఎకరాకు రూ.40 వేలు

నీటి వసతి లేని రైతులను టీడీపీ నాయకుడు పాండురంగ లక్ష్యంగా చేసుకున్నాడు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల ప్రకారం వెయ్యి ఎకరాలకు నీటిని అందించేలా జనార్దనపల్లి, వేల్పుమడుగు రైతులతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. జీబీసీకి నీరు బంద్ అయ్యే దాకా నీటిని ఇస్తానని హామీలు గుప్పించాడు. ఇందులో భాగంగానే గత ఏడాది ఆగస్టు నుంచి వెయ్యి ఎకరాలకు నీటిని మళ్లిస్తున్నాడు.

మూడు కోట్లకు పైగా...

పంటలకు నీళ్లొస్తాయన్న ఆశతో వెయ్యి ఎకరాలకు సంబంధించి భూములున్న రైతులందరూ పాండురంగతో పాటు అతని సహచరులతో అగ్రిమెంట్ చేసుకున్నారు. మాట్లాడుకున్నదాన్ని బట్టి రూ.30 వేల నుంచి రూ.40 వేల దాకా వసూలు చేశాడు. ఇలా రూ.3 కోట్లకు పైగానే ఆర్జించారు.

పట్టించుకోని అధికారులు

జీబీసీ కెనాల్ నుంచి దాదాపు వేల్పుమడుగు గ్రామ పొలాలకు పది కిలో మీటర్ల దూరంలో ఉన్న నాన్ ఆయకట్టు భూమికి సాగునీరు అందిస్తున్నారంటే తెలుగు తమ్ముళ్లు ఎంత బరి తెగించారో అందరికీ అర్థమవుతుందని స్థానిక రైతులు చెబుతున్నారు. అయితే తెలుగు తమ్ముళ్లు ఇంత పెద్ద ఎత్తున నీటి దందా కొనసాగిస్తున్నా జీబీసీ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం విశేషం. అధికారులు కూడా వాటాలు తీసుకొని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పెద్ద ఎత్తున ఆరోపణలున్నాయి.



తన పొలంలో అక్రమంగా వేసిన పైపులైన్‌ను చూపుతున్న పార్థసారథి

ఎమ్మెల్యే అండతోనే...

స్థానిక ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అండతోనే తెలుగు తమ్ముళ్లు జీబీసీ సాగునీరును అక్రమంగా తోడుకొని నాన్ ఆయకట్టుకు పంపింగ్ చేసి లక్షల్లో లాభాలు పొందుతున్నారని రైతులు విమర్శిస్తున్నారు. ఇలాంటి అక్రమార్కుల వలన ఎంతో మంది రైతులకు చెందిన ఆయకట్టు భూములకు సాగునీరు అందక బీడు భూములుగా మిగిలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

అక్రమ విద్యుత్ కనెక్షన్లు

నీటి దందాకు ఏ ఇబ్బంది రాకుండా అక్రమంగా విద్యుత్ కనెక్షన్లను తీసుకొని దర్జాగా జీబీసీకి చెందిన నీటిని పంపింగ్ చేస్తున్నారు. మరి కొంతమంది అక్రమదారులు నేరుగా ప్రైవేట్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చుకొని నీటిని పంపింగ్ చేస్తున్నారు. వీటిని కూడా విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోకపోవడం విశేషం. ఇప్పటికైనా జీబీసీ అధికారులు అక్రమంగా నీటి దందా సాగిస్తున్న తెలుగు తమ్ముళ్లపై చర్యలు తీసుకొని నీటి చౌర్యాన్ని అరికట్టాలని ఆయకట్టు రైతులు డిమాండు చేస్తున్నారు.

పంట దెబ్బతింది

ఇష్టం లేకపోయినా పాండు రంగతో పాటు అతని సహచరులంతా కలసి నా పొలంలో ఏడు పైపులైన్లు అమర్చి ఇతరుల పొలాలకు నీటిని పంపింగ్ చేస్తున్నారు. పొలంలో పైపు లైన్లు పోవడం వల్ల నీరు లీకై పప్పుశనగ పంట నాశనం అయ్యింది. పంట కూడా చేతికి అందే పరిస్థితి లేక అవస్థ పడుతున్నా.

– డి పార్థసారథి, జనార్దనపల్లి

క్లుప్తంగా

6న భీమరెడ్డి విగ్రహావిష్కరణ

- తరలి రావాలని ప్రజలకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పిలుపు



ఉరవకొండ: ఉరవకొండ నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు, తన తండ్రి స్వర్గీయ యల్లారెడ్డి గారి భీమరెడ్డి శిలావిగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి తరలి రావాలని నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 6న గుంతకల్లు – కొనకొండ్ల మధ్య గల హనుమాన్ జంక్షన్ వద్ద విగ్రహావిష్కరణ ఉంటుందన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తన తల్లి యల్లారెడ్డి గారి లలితమ్మ, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మంత్రులు బుగ్గనరాజేంద్రనాథ్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం, ఉషశ్రీచరణ్, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్లమాధవ్‌తో పాటు కర్నూలు, అనంతపురం జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

వైభవం.. సునామ జకినీమాత ఉత్సవం

గుత్తి: దేశంలోని నలుమూలల నుంచి తరలివచ్చిన ఆరె కటికలతో గుత్తి, గుత్తి ఆర్ఎస్ పట్టణాలు కిక్కిరిసాయి. 'సునామ జకినీ మాతకీ జై 'అనే నినాదాలతో వీధులన్నీ మారుమోగాయి. సునామ జకినీ మాత జాతర గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఆలయంలో సునామ జకినీ మాత, మల్కుమని జకినీ మాత మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, పూజలు, అలంకరణలు చేశారు. వేలాది భక్తులు బారులు తీరి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అనంతరం గుత్తిలోని శిరిడి సాయిబాబా ఆలయం వద్ద నుంచి అమృత్ థియేటర్, గాంధీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, ప్రభుత్వాస్పత్రి మీదుగా జకినీ మాత ఆలయం వరకూ 108 కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరె కటిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలూరి లక్ష్మణరావు, రాష్ట్ర నాయకుడు సాయి సుభాష్, ఆలయ ధర్మకర్త సురేష్‌రావు, ఆలయ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కసాపురం నాగరాజు, బాబురావు, సుధాకర్‌రావు, రవిబాబు, ప్రధాన కార్యదర్శి సాయినాథ్, కోశాధికారి రామచంద్రరావు, యూత్ నాయకులు భాగ్యరాజ్, లక్ష్మీకాంత్, శ్రీనివాసులు, ఆలయ మేనేజర్ పంకజ లక్ష్మి, సాయి సుభాష్ బాబు, మల్లేష్‌రావు, జగత్‌రావు, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.





ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై సునామజకినీ మాత ఉత్సవ మూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం, కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటున్న భక్తులు

'ఆనర్స్'పై చైతన్య పరచండి

- వర్సిటీలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను మీడియా ద్వారా తెలియజేయాలి
- ప్రతి విద్యార్థికీ ఇంటర్న్‌షిప్ తప్పనిసరి
- ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి వెల్లడి



సూచనలిస్తున్న డాక్టర్ హేమచంద్రా రెడ్డి

అనంతపురం: 'ఉన్నత విద్య పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ఇతోధికంగా నిధులు వెచ్చిస్తోంది, ఈ క్రమంలో వర్సిటీల్లో స్కిల్ కళాశాలల ఏర్పాటు, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. ఇలాంటి ముఖ్యమైన అంశాలు మీడి యా ద్వారా ప్రజలకు చేరువ చేయాలి. మీడియాకు సమాచారం అందించడంలో వైఫల్యం చెందితే ఎలా?' అంటూ జేఎన్‌టీయూ (ఏ) అధికారులను ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ కె.హేమ చంద్రారెడ్డి ప్రశ్నించారు. వర్సిటీ పరిధిలోని పలు అంశాలపై గురువారం జేఎన్‌టీయూ (ఏ) పాలక భవనంలో వర్సిటీ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. ప్రతి ఇంజినీరింగ్, ఫార్మసీ విద్యార్థికి సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్ దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కేవలం ఫీజు రీయింబర్స్‌మెంట్‌కే రూ.5 వేల కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. అనంతపురం పార్లమెంట్‌కు సంబంధించి స్కిల్ కళాశాలను జేఎన్‌టీయూ(ఏ)లో ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రమంలో వర్సిటీల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు సమాజానికి తెలియకపోతే అది మన వైఫల్యంగానే భావించాల్సి ఉంటుందని అసహనం వ్యక్తం చేశారు. సంప్రదాయ డిగ్రీ కోర్సులకు స్వస్తి పలుకుతూ నూతనంగా అమల్లోకి తెచ్చిన ఆనర్స్ డిగ్రీ విధానంపై విద్యార్థులను చైతన్య పరచాలని సూచించారు. ఈ విధానం వల్ల నైపుణ్యాలతో పాటు ఉపాధి అవకాశాలూ మెరుగు పడతాయన్నారు. గతంలో ఇంటర్న్‌షిప్ ఉండేది కాదని గుర్తు చేశారు. నూతన విధానం ద్వారా ప్రతి విద్యార్థికీ ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేసినట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సహకారం తీసుకోండి

పూర్వ విద్యార్థుల సహకారంతో వర్సిటీ మరింత అభివృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల్లో ఆలోచన మారి, ఉద్యోగావకాశాలు దక్కేందుకు సహకరించేలా పూర్వ విద్యార్థులతో ఒక ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేయాలని సూచించారు. పూర్వ విద్యార్థుల యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు. పరిశోధన ప్రాజెక్ట్‌లకు ప్రతి అధ్యాపకుడు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బోధన, పరిశోధనలను తొలి ప్రాధాన్యతగా భావిస్తామన్నారు. పరిశోధన ప్రాజెక్ట్‌ల దరఖాస్తులో అలసత్వం ఉండకూడదన్నారు. సమావేశంలో జేఎన్‌టీయూ (ఏ)రిజిస్ట్రార్ సి.శశిధర్, ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ కేశవ రెడ్డి, ప్రొఫెసర్లు సి.శోభాబిందు, భువన విజయ, పద్మ సువర్ణ, సుబ్బారెడ్డి, ఎ.సురేష్ బాబు, బి.ఈశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ పి.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.భవాని, పీఆర్వో డాక్టర్ ఎం.రామశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విజిలెన్స్' పేరుతో రిపోర్టర్ దందా

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పాత్రికేయులుగా పనిచేస్తూ అక్రమ దందాకు తెరలేపారు కొందరు. పోలీసు ఇన్‌ఫార్మర్లమంటూ.. విజిలెన్స్ అధికారులమంటూ అక్రమ వసూళ్లకు తెరలేపారు. తాజాగా ఈ పరిస్థితుల్లోనే ఓ సీనియర్ పాత్రికేయుడి బాగోతం ఆలస్యంగా వెలుగు చూసింది. 44వ జాతీయ రహదారిపై అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న రెండు ఆటోలను అటకాయించి తాను విజిలెన్స్ అధికారినని తనకు డబ్బు ఇవ్వకపోతే వాహనాలను సీజ్ చేస్తానని డ్రైవర్లను బెదిరించాడు. ఓ ఆటో డ్రైవర్ రూ.40 వేలు ఇవ్వడంతో ఆ వాహనాన్ని వదిలేసి, మరో ఆటో డ్రైవర్‌ను డబ్బు కోసం పీడించాడు. చివరకు డబ్బు ఇవ్వకపోవడంతో విషయాన్ని విజిలెన్స్ అధికారులకు చేరవేశాడు. దీంతో రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు రెండు ఆటోలను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అసలు బాగోతం వెలుగు చూడడంతో సీనియర్ రిపోర్టర్‌గా చలామణి అవుతున్న వ్యక్తిని రాప్తాడు పోలీసులకు విజిలెన్స్ అధికారులు అప్పగించారు. పోలీసుల చెంతకు చేరిన రిపోర్టర్ అప్పటికే పీకల దాకా మద్యం తాగి ఉండడంతో పోలీసులు మందలించి, పంపేశారు. కాగా, గుత్తి రోడ్డులోనూ బియ్యం వ్యాపారులతో అక్రమ వసూళ్లకు పాల్పడిన విషయం వెలుగు చూసింది. మొత్తం ఈ వ్యవహారంపై విజిలెన్స్ అధికారిని ఆరా తీయగా నిజమేనని స్పష్టం చేశారు.

పప్పు పాదయాత్రతో టీడీపీకే నష్టం : విప్ కాపు



గుమ్మఘట్ట: రాజకీయాల్లో తానో శుద్ధ పప్పుగా ముద్ర వేసుకున్న లోకేష్ పాదయాత్ర వల్ల టీడీపీకే ఎక్కువ నష్టమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. గుమ్మఘట్ట మండలం పూలకుంటలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుంటూరు, కందుకూరులో చంద్రబాబు నిర్వహించిన సమావేశాలకు అధిక జనం హాజరైనట్లుగా చూపించే క్రమంలో 11 మంది ప్రాణాలు బలిగొన్నారని మండిపడ్డారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గోదావరి పుష్కరాల్లో 30 మందిని పొట్టనబెట్టుకున్న చరిత్ర చంద్రబాబుదన్నారు. చంద్రబాబు ప్రచార పిచ్చి కారణంగా చోటు చేసుకున్న ఈ దుర్ఘటనలో నేటికీ మృతుల కుటుంబాలు కోలుకోలేదన్నారు. లోకేష్ పాదయాత్రకు జనం మద్దతు కరువైందన్నారు. తమ ఉనికిని కాపాడుకునేందుకు అప్పుడప్పుడూ మీడియా ముందుకు వచ్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారు తప్ప ఏనాడు ప్రజాసమస్యలపై పోరాటం చేసింది లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను రియల్‌హీరోగా ప్రపంచ ప్రఖ్యాత గాంచిన మోటివేషనల్ స్పీకర్ నికోలస్ జేమ్స్ వుజిసిక్ పొగడ్తలతో ముంచెత్తితే.. ఈ అంశాన్ని పచ్చమీడియా ఎక్కడా చూపలేదన్నారు. ఇక్కడే వారి వక్రబుద్ధి బహిర్గతమవుతుందన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ కనుమరుగవడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, మార్కెట్ యార్డు చైర్మన్ భోజరాజ్ నాయక్, ఎంపీపీ భవాని, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మంజునాథ, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, తదితరులు ఉన్నారు.

ఎల్లో మీడియా మైండ్‌గేమ్‌ను పట్టించుకోవద్దు

- జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వ



మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

కూడేరు: టీడీపీకి ప్రజల్లో ఇమేజ్ పెంచేందుకు సర్వేల పేరిట సీఎం జగన్‌కు గ్రాఫ్ పడిపోయిందంటూ, నేతల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయంటూ ఎల్లో మీడియా తప్పుడు రాతలు రాస్తూ, ప్రసారాలు చేస్తూ మైండ్ గేమ్ ఆడుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. ఈ వైఖరిని ప్రజలెవరూ పట్టించుకోరాదని కోరారు. గురువారం కూడేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనుల ముందు ఎల్లో మీడియా దుష్ప్రచారం వీగిపోతోందన్నారు. ప్రజలెవ్వరూ ఎల్లోమీడియా రాతలను నమ్మడం లేదన్నారు. లోకేష్ పాదయాత్రకు ప్రజాదరణ కరువైందన్నారు. దీంతో తమిళ ఆర్టిస్టులతో చిరు వ్యాపారుల అవతారమెత్తించి ప్రభుత్వం ఏమి చేయలేదని చెప్పించే ప్రయత్నం చేస్తున్నారని మండి పడ్డాడు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియా ఎన్ని కుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో ప్రజా మద్దతుతో వైఎస్సార్ సీపీ ఘటన విజయం సాధిస్తుందన్నారు. సమావేశంలో ఎంపీపీ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు తోపుదుర్తి వెంకటలక్ష్మమ్మ, కో ఆప్షన్ సభ్యుడు సర్దార్ వలి, నాయకులు బైరెడ్డి రామచంద్రారెడ్డి, విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వ వైఖరిని ప్రతిఘటిద్దాం : సీపీఎం

అనంతపురం అర్బన్: రాయలసీమను ఎడారిగా మార్చే కేంద్రంలోని బీజేపీ సర్కార్ వైఖరిపై ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ వద్ద గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుంగభద్ర జలాశయానికి ఎగువన భద్రా నీటిని అప్పర్ భద్రా పథకానికి ఎత్తిపోతల ద్వారా మళ్లించేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.5,300 కోట్లను కేటాయించడంపై మండిపడ్డారు. ఈ పనులు పూర్తయితే తుంగభద్ర జలాశయానికి నీటి లభ్యత తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పర్‌భద్రా అంశంపై ఏపీ ప్రభుత్వం ఇప్పటికే అభ్యంతరాలు తెలిపిందని గుర్తు చేశారు.

ప్రమాదాల నివారణలో డ్రైవరే కీలకం

- ఆర్టీసీ జోనల్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల
- రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ఉత్తమ డ్రైవర్లకు ప్రశంస



రీజియన్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన జీకే మొహిద్దీన్ (అనంతపురం)కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న మాల్యవంతం మంజుల (చిత్రంలో) డీఎస్పీ మహబూబ్‌బాషా, పీటీడీ జిల్లా అధికారి సుమంత్.ఆర్.ఆదోని



వై.చాంద్‌బాషా (తాడిపత్రి)




వీఎస్ఎస్ వలి(తాడిపత్రి)

అనంతపురం క్రైం: రోడ్డు ప్రమాదాల నియంత్రణలో అనంత రీజియన్ ఆర్టీసీ డ్రైవర్లు, మెకానిక్‌లు, అధికారులు విశేషంగా కృషి చేస్తున్నారని, ఇదే స్ఫూర్తితో ఆర్టీసీని లాభాల బాటలో నడిపించాలని పీటీడీ ఉద్యోగులకు ఆర్టీసీ జోనల్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం అనంతపురం డిపోలో ఘనంగా నిర్వహించారు. విశిష్ట అతిథిగా ఆర్టీసీ జోనల్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, ముఖ్యఅతిథిగా సీసీఎస్ డీఎస్పీ మహబూబ్‌బాషా, జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్.ఆర్.ఆదోని హాజరై ప్రమాద రహిత డ్రైవర్లకు రివార్డు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో మంజుల మాట్లాడుతూ.. 2021, 2022 సంవత్సరాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 0.06 ప్రమాద శాతం నమోదైందన్నారు. ఈ ఏడాది ఆ శాతం మరింత తగ్గించాలని డ్రైవర్లకు సూచించారు. ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోకి విలీనం చేశారని గుర్తు చేశారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ జీతాలు సక్రమంగా అందజేశారన్నారు. ఈ క్రమంలో ఆర్టీసీని మరింత లాభాల బాటలో నడిపేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. డీఎస్పీ మహబూబ్‌బాషా మాట్లాడుతూ.. ఆర్టీసీ సర్వీసులంటే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుతామనే నమ్మకం ప్రజల్లో ఉందని, ఈ నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరింత నాణ్యమైన సేవలను అందజేయాలని సూచించారు. జిల్లా ప్రజా రవాణాధికారి సుమంత్.ఆర్.ఆదోని మాట్లాడుతూ... రక్షణాత్మక డ్రైవింగ్ చేపట్టి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ప్రమాద రహిత రీజియనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం ఉత్తమ పనితీరు కనబరిచిన డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు, రివార్డులు అందజేశారు. రీజియన్ పరిధిలో ఉత్తమ డ్రైవర్లుగా జీకే మొహిద్దీన్ (అనంతపురం), వై.చాంద్‌బాషా (తాడిపత్రి), వీఎస్ఎస్ వలి (తాడిపత్రి) అవార్డులు అందుకున్నారు. అలాగే డిపోల వారీగా ప్రమాద రహిత డ్రైవర్లుగా బీఆర్ ఆంజనేయులు, డీ ప్రసాద్, ఎస్ఎం బాషా (అనంతపురం), బీ బాలస్వామి, వైకే మూర్తి, హెచ్‌కే పీరా (గుంతకల్లు), ఎస్ ఉస్మాన్, బీ ఈరన్న, కే రాజు (గుత్తి), కేవీ రాముడు, బీ శంకర్, ఎం ప్రసాద్(తాడిపత్రి), జీ వెంకటేష్, టీవీ రమణ, ఎస్ఆర్ కృష్ణ (కళ్యాణదుర్గం), వీ శేఖర్, డీజీ నాయక్, కే వెంకటేశులు (రాయదుర్గం), ఏ వెంకటేశులు, పీ బాషా, బీఎల్ నారాయణ (ఉరవకొండ) అవార్డులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో డీఎం నాగభూపాల్, లా ఆఫీసర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ వినయ్‌కుమార్, సూపరింటెండెంట్ అవధాని శ్రీపాద, పీఆర్‌ఓ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

హనుమద్ వాహనంపై రంగనాథుడు

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నాల్గో రోజు దేవేరులతో కలసి రంగనాథుడు హనుమద్ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవ మూర్తులను జమ్మి చెట్టు వరకూ ఊరేగించి ఆలయంలో కొలువు దీర్చారు. ఆలయ ఈఓ దేవదాసు, సీఐ వెంకట్రామిరెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఉత్సవ మూర్తులు

తండ్రినే కడతేర్చాడు!

- లారీతో ఢీకొట్టి రోడ్డు ప్రమాదంగా చిత్రించే యత్నం
- గంటల వ్యవధిలోనే కేసు ఛేదించిన పోలీసులు

ఆత్మకూరు (నెల్లూరు): కన్నతండ్రినే లారీతో గుద్ది హతమార్చాడు ఓ దుర్మార్గుడు. అనంతరం రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించి పోలీసులకు పట్టుబడ్డాడు. వివరాలను నెల్లూరు జిల్లా ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి గురువారం వెల్లడించారు. తాడిపత్రిలోని టైలర్స్ కాలనీకి చెందిన షేక్ మహబూబ్‌బాషా (62) తన కుమారుడు షేక్ మహమ్మద్ షఫీ డ్రైవర్‌గా వెళుతున్న లారీకి క్లీనర్‌గా వెళుతూ జీవనం సాగిస్తున్నాడు. మద్యం మత్తులో తరచూ తండ్రీకొడుకు ఇంటి వద్ద గొడవ పడుతుండేవారు. దీంతో షఫీ మొదటి భార్య అతని నుంచి విడిపోయింది. ఈ క్రమంలో షఫీ మరో వివాహం చేసుకున్నాడు. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. తండ్రీకుమారుడు మళ్లీ ఇంటి వద్ద గొడవ పడుతుండడంతో ఆమె కూడా పుట్టింటికి వెళ్లేందుకు సిద్ధమైంది. దీంతో తన తండ్రిని హతమారిస్తే సమస్య ఉండదని భావించిన షఫీ... తిరుపతి జిల్లా డక్కిలిలో సిమెంట్‌ను అన్‌లోడ్ చేసేందుకు తండ్రితో పాటు మంగళవారం రాత్రి బయలుదేరాడు. కుటుంబానికి సన్నిహితుడైన చిన్న ఓబయ్య అదే లారీలో ఎక్కాడు. మర్రిపాడు మండలం రాజుపాళెం జంక్షన్ సమీపంలో తండ్రీకొడుకు లారీ దిగి రోడ్డుపై ఘర్షణకు దిగారు. ఇంతలో షఫీ హఠాత్తుగా లారీ ఎక్కి రోడ్డుపై ఉన్న తండ్రిని లారీతో గుద్దాడు. కిందపడిన తండ్రి కాళ్లపై తొక్కిస్తూ వాహనాన్ని ముందుకు దూకించి అదే వేగంతో వెళ్లిపోయాడు. చిన్న ఓబయ్య నుంచి బుధవారం ఉదయం సమాచారం అందుకున్న మర్రిపాడు పోలీసులు ఎస్ఐ పి.విశ్వనాథరెడ్డి, సీఐ కేఎం.నాగేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. కలువాయి మండలం వెంకటరెడ్డిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు డీఎస్పీ కోటారెడ్డి వివరించారు.

'అనంత'లో ఆర్‌ఏఎఫ్ బలగాలు



నగరంలో కవాతు నిర్వహిస్తున్న ఆర్‌ఏఎఫ్ బలగాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా కేంద్రానికి గురువారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) దళం చేరుకుంది. ఈ క్రమంలో గురువారం సప్తగిరి సర్కిల్ వద్ద ఆర్‌ఏఎఫ్ బలగాలతో ఏర్పాటు చేసిన కవాతును అదనపు ఎస్పీ నాగేంద్రుడు ప్రారంభించి, మాట్లాడారు. జిల్లా వాసులకు భద్రతతో పాటు భరోసా ఇచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. విపత్తులు, ఆందోళనల సమయాల్లో ఈ దళం సహకారం మరువలేనిదన్నారు. సమస్యాత్మక, అతి సున్నిత ప్రాంతాలపై ఆర్‌ఏఎఫ్ బృందానికి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హకీంపేట్ 99వ బెటాలియన్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ వినోద్, అసిస్టెంట్ కమాండెంట్ సతీష్, దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సీఐలు రవిశంకరరెడ్డి, శివరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో విశ్వాసం పెంపొందిద్దాం..

పోలీసు వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా చర్యలు తీసుకుందామని ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ అధికారులకు ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప సూచించారు. గురువారం అనంతపురానికి చేరుకున్న ఆర్‌ఏఎఫ్ బలగాలు ముందుగా జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎస్పీతో ఆర్‌ఏఎఫ్ డిప్యూటీ కమాండెంట్ వినోద్, అసిస్టెంట్ కమాండెంట్ సతీష్ తదితరులు కలసి మాట్లాడారు.

క్లుప్తంగా

పౌష్టికాహారం తీసుకోవాలి

ఆత్మకూరు: పౌష్టికాహారంతోనే చిన్నారులు, గర్భిణుల్లో రక్తహీనత సమస్యలు రావని నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు తెలిపారు.గురువారం మండలంలోని తలుపూరులోని ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు.ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో రక్త హీనత సమస్య పరిష్కరించడానికి ప్రభుత్వం చొరవతీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండన్న , సర్పంచ్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

5న పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: స్పందన కవుల అనంత వేదిక ఆధ్వర్యంలో ఈనెల 5న తూమచర్ల రాజారామ్ రచించిన 'కవయిత్రుల కవితాత రంగం' పుస్తకావిష్కరణ ఉంటుందని సంస్థ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఉదయం 10.20 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

శ్రీచైతన్యలో ప్రీప్రైమరీ స్పోర్ట్స్ కిడ్స్



స్పోర్ట్స్ కిడ్స్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ నేత్రావతి

అనంతపురం: శ్రీ చైతన్య విద్యాసంస్థ , హౌసింగ్‌బోర్డులో ప్రీప్రైమరీ స్పోర్ట్స్ కిడ్స్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీ చైతన్య విద్యాసంస్థ ఏజీఎం సుబ్బా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడల గురించి విద్యార్థులకు తెలియజేశారు. స్పోర్ట్స్‌లో గెలుపొందిన పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నేత్రావతి, డీన్ అరుణ్‌కుమార్, కోఆర్డినేటర్ తిరుమలేశ్వర్, సబిత, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి దేవీ,కృప, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి వారపు సంత

ఆత్మకూరు: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-2 పక్కన ఉన్న చింత తోపుల వనంలోని ఎకరం స్థలంలో వారపు సంత ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీపీ హేమలత గురువారం తెలిపారు. మండల ప్రత్యేక అధికారి రామాంజనేయులు, ఎంపీపీ హేమలత పంచాయతీ సిబ్బందితో కలసి వారపు సంత నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరులో వారపు సంత నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 5న సంత ప్రారంభమవుతుందన్నారు. ఆత్మకూరు మండల గ్రామాల నుంచే కాకుండా కల్యాణదుర్గం, కనగానపల్లి, కూడేరు, బెళుగుప్ప మండలాల ప్రజల కూడా విక్రయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ బాలపోతన్న, పంచాయతీ సెక్రటరీ శైలజా రాణి, శిరీష, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, టైలర్ వెంకటేష్, గూలి విశ్వనాథ్‌రెడ్డి, శ్రీరామ్, వెంకట్రామిరెడ్డి, వార్డు మెంబర్లు పెద్దన్న, ఈశ్వరయ్య, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక పటుత్వం అవసరం

- ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కీలకమైన విభాగంలో పనిచేస్తుండడం వల్ల ప్రతి ఒక్కరూ మానసిక పటుత్వం కలిగి ఉండాలని పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ (పీఎస్‌ఓ)లకు ఏఆర్ విభాగం అదనపు ఎస్పీ హనుమంతు సూచించారు. ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులుతో కలసి స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో పీఎస్‌ఓలతో గురువారం ఆయన సమావేశమై మాట్లాడారు. మానసికంగా దృఢంగా ఉన్నారా లేదా అనే కోణంలో ఆరా తీసి ప్రతి ఒక్కరి సమస్యలూ అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత సమస్యలు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతుంటే ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చూపుతామన్నారు. వీఐపీల వద్ద గార్డు, ఎస్కార్ట్ విధుల్లో ఉన్న సిబ్బంది మానసిక స్థితిగతులపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఫిజికల్ ఫిట్‌నెస్‌తో పాటు మానసికంగా దృఢంగా ఉంటేనే వీఐపీలకు సరైన భద్రత కల్పించగలమన్నారు.

లీకేజీ పనుల పరిశీలన

అనంతపురం క్రైం: నడిమివంక వద్ద నీటి పైప్‌లైన్ మరమ్మతు పనులను డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి గురువారం రాత్రి పరిశీలించారు. తాగునీటి మెయిన్ పైప్‌లైన్ పనులు చేస్తుండగా 6వ రోడ్డు, గౌరవగార్డెన్ తదితర ప్రాంతాల్లో ఉన్న ట్యాంకులకు నీరు సరఫరా అయ్యే పైప్‌లైన్ లీకేజీ అయ్యింది. డిప్యూటీ మేయర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. శుక్రవారం నాటికి యథావిధిగా ఆయా ప్రాంతాలకు నీటి సరఫరా జరుగుతుందని ఆయన తెలిపారు.

మహిళకు అరుదైన శస్త్రచికిత్స

అనంతపురం సప్తగిరి సర్కిల్: గుండె జబ్బుతో బాధపడుతున్న మహిళకు నగరంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రి వైద్యులు డ్యుయల్ చాంబర్ పేస్ మేకర్ అమర్చి ప్రాణాలు కాపాడారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ మూడే సందీప్ మాట్లాడుతూ నగరానికి చెందిన మహిళకు చమట పట్టడం, కళ్లు తిరగడం, బీపీ రికార్డు కాకపోవడం తదితర సమస్యలతో ఆస్పత్రిలో చేరిందన్నారు. ఆమె గుండె నిమిషానికి 30 సార్లు మాత్రమే కొట్టుకుంటుందన్నారు. దీంతో ఆమెకు డ్యుయల్ ఛాంబర్ పేస్ మేకర్ అమర్చామన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించడంతో ఉచితంగా పరికరం అమర్చామన్నారు.

టీడీపీ అభివృద్ధి డివైడర్లకే పరిమితం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



34వ డివిజన్‌లో సంక్షేమపథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: తెలుగుదేశం ఐదేళ్ల పాలనలో నియోజకవర్గ అభివృద్ధిని అంటే కేవలం డివైడర్లకే పరిమితమైందని, అభివృద్ధి ఎక్కడ చేశారో ప్రజలకు వివరిస్తే చాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం రుద్రంపేట పంచాయతీలోని చంద్రబాబునగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు అభివృద్ధిపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వారి పాలనలో నగరాన్ని ఏమాత్రం అభివృద్ధి చేశారో ప్రజలకు తెలుసునన్నారు. కమీషన్ల కోసం డివైడర్లను కూల్చడం, మళ్లీ అవే డివైడర్లనే నిర్మించడంతోనే ఐదేళ్ల పాలన ముగిసిందన్నారు.

రూ.800కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం: తమ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన ఈ మూడున్నరేళ్లలో నగర అభివృద్ధితోపాటు నియోజకవర్గంలోని నాలుగు పంచాయతీల్లో దాదాపు రూ.800కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే అన్నారు. వీటితోపాటు అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గతంలో రుద్రంపేట పంచాయతీలో ఎక్కడ చూసిన మురుగునీటితో రహదారులు దర్శనమిచ్చేవన్నారు. ప్రస్తుతం ఏ వీధి చూసినా సీసీ రోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చేసి ప్రజా సమస్యలను పరిష్కరించి ప్రజలకు రహదారులను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. తాగునీటి కోసం గతంలో రుద్రంపేట పంచాయతీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం ప్రతి కాలనీకి పైప్‌లైన్ ద్వారా ఇంటి వద్దకు తాగునీటిని అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం రోజుకు 60 వేల లీటర్ల నీటిని అందిస్తున్నామని, భవిష్యత్‌లో నీటి ఎద్దడికి తావులేకుండా శాశ్వతంగా రోజుకు 1.20 లక్షల లీటర్ల నీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఉప సర్పంచ్ నరేంద్రరెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీటీసీలు మహబూబీ, లక్ష్మీనారాయణమ్మ, ఓంప్రకాశ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, సాదిక్‌వలి, కృష్ణవేణి, కుళ్లాయప్ప, గోవింద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతినాయుడు, మల్లెల వేణుగోపాల్, రహీం, అంజీ, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి

అనంతపురం క్రైం: 'డివిజన్‌లో మానసిక వైకల్యంతో బాధపడుతున్న వారు, దివ్యాంగులు ఎవరైనా ఉంటే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలి.. స్లాట్ నమోదు చేయించి పింఛన్ వర్తింపజేయాలని సచివాలయ సిబ్బందిని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించారు. గురువారం నగరంలోని 34వ డివిజన్‌లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ మునగల రమాదేవితో కలసి మంగళవారి కాలనీలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మేలును గుర్తు చేశారు. స్థానికులు బాబయ్య, కుళ్లాయప్ప, సయ్యద్ బాషా (సెన్‌ట్రింగ్), తైరాజ్‌భాను, తదితరులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్థానికుల సమస్యలు పరిష్కరించలేదన్న విషయంపై వలంటీర్ శివపార్వతి, సచివాలయ సిబ్బందిపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ఎవరైనా ఇంత పెద్ద స్థాయిలో ఇళ్లు అందిచారనన్నారు. కామారుపల్లి స్థలం ఇంటి నిర్మాణానికి అనువైనది కాకపోవడంతో నగర సమీపంలో మరో అనువైన స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటామని స్థానిక ప్రజలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు సాకే చంద్రశేఖర్, అనిల్‌కుమార్ రెడ్డి, డైరెక్టర్లు గోయిందు, శ్రీనివాసులు, శోభారాణి, శ్రీదేవి, నాయకులు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, నిహార్ రెడ్డి, జావెద్, శోభాబాయి, భారతి, గౌరి, తదితరులు పాల్గొన్నారు.

మేమంతా జగన్ వెంటే



రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ను కలిసిన జిల్లా వైఎస్సార్ సీపీ నాయకులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: విజయవాడలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ దిల్‌మే వైఎస్సార్.. హమ్ సబ్ జగన్‌కే సాథ్ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి అంజాద్‌బాషా, ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషాను సన్మానించారు. కార్యక్రమంలో నగర మేయర్ వసీం, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైస్ చైర్మన్ అహమ్మద్‌బాషా, కార్యదర్శి నూర్ మహమ్మద్, జాయింట్ సెక్రటరి, ఖాజా, సభ్యులు ఖమర్‌తాజ్, ఫయాజ్, మహబూబ్‌పీరా, షెక్షావలి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, మహిళ నాయకురాలు మునీరాబేగం, కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, ఇసాక్, రహంతుల్లా, కువైట్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయాన్ని తొలగించాలని వినతి



దేవదాయశాఖ ఏసీకి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: రాప్తాడు పండమేటి వెంకటరమణ స్వామి ఆలయానికి చెందిన భూమిలో అక్రమంగా నిర్మించిన టీడీపీ కార్యాలయాన్ని తొలగించాల్సిందేనని, లేదంటే తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేస్తామని రాప్తాడు, అనంతపురం ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హెచ్చరించారు. గురువారం దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, ఏపీఐఐసీ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతపురం జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, రాప్తాడు వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, రాప్తాడు మండల యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాప్తాడు, అనంతపురం మండలాల కన్వీనర్లు జూటూరు శేఖర్, దుగుమర్రి గోవిందరెడ్డి, బండి పవన్‌కుమార్ తదితరులు మాట్లాడారు. పండమేటి వెంకటరమణస్వామి ఆలయానికి చెందిన 33.44 ఎకరాల భూమిని ఏపీఐఐసీకి లీజుకు ఇచ్చారన్నారు. వీరి నుంచి ఆటోనగర్‌కు సబ్‌లీజ్‌కు తీసుకున్నారన్నారు. ఇందులో మిగులుగా ఉన్న 1.02 ఎకరాల భూమిని అతిథిగృహం కోసమని, అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రాప్తాడు పంచాయతీ తీర్మానం చేసిందన్నారు. ఏపీఐఐసీ ఆధీనంలో ఉన్న ఈభూమిలో కేవలం పంచాయతీ తీర్మానంతోనే అది కూడా అతిథిగృహం కాకుండా టీడీపీ కార్యాలయాన్ని నిర్మించారన్నారు. అప్పట్లో మంత్రిగా ఉన్న పరిటాల సునీత, ఆమె కుమారుడు పరిటాల శ్రీరామ్ దౌర్జన్యంతో ఈ భూమిని ఆక్రమించుకున్నారన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.కోట్లు విలువజేసే భూమిని కబ్జా చేశారన్నారు. ఈ అక్రమ వ్యవహారాలపై దేవదాయశాఖ, ఏపీఐఐసీ అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా రెండుశాఖల అధికారులు చొరవ తీసుకొని అక్రమంగా నిర్మించిన టీడీపీ కార్యాలయాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే దేవాదాయ, ఏపీఐఐసీ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాప్తాడు మండల నాయకులు రవికుమార్, తలారి శింగారప్ప, తిరుపాల్‌రెడ్డి, పాలచెర్ల మధు, నరేంద్రరెడ్డి, అనంతపురం రూరల్ మండల నాయకులు గుజ్జల ఈశ్వరయ్య, యూత్ కన్వీనర్ శ్రీనివాసులు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ పనితీరుకు ప్రశంస



అవార్డు అందుకుంటున్న డ్రైవర్ ఆంజనేయులు



డీ ప్రసాద్



ఎస్ఎం బాషా

అనంతపురం క్రైం: రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా అనంతపురం డిపో డ్రైవర్లు ప్రశంసాపత్రాలు గురువారం అందుకున్నారు. ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, సీసీఎస్ డీఎస్పీ మహబూబ్‌బాషా, జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్.ఆర్.ఆదోని చేతుల మీదుగా ఉత్తమ డ్రైవర్లు ఆంజనేయులు, డి.ప్రసాద్, ఎస్ఎం బాషాకు అవార్డులు,ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఆర్డీఓ మధుసూదన్ హామీ



మాట్లాడుతున్న ఆర్డీఓ మధుసూదన్

అనంతపురం అర్బన్: ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం సమస్యను పరిష్కరిస్తామని సీపీఎం నాయకులకు ఆర్డీఓ మధుసూదన్ హామీ ఇచ్చారు. సీపీఎం చేపట్టిన 30 గంటల సత్యాగ్రహం దీక్ష శిబిరం వద్దకు ఆర్డీఓ, బుక్కరాయసముద్రం తహసీల్దారు మోహన్‌కుమార్ బుధవారం చేరుకున్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓకు సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, రాష్ట్ర నాయకుడు ఓబులు అందజేసి సమస్యలు వివరించారు. ఇళ్లు లేనివారి ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేయాలని కోరారు. పలు చోట్ల ప్రభుత్వ స్థలం కబ్జా చేసి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, సర్వే నంబర్లతో సహా వివరాలను మీకు సమర్పించామని చెప్పారు. వాటిని పరిశీలించిన ఆర్డీఓ మాట్లాడుతూ తన పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామని, మిగిలిన వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీపీఎం నాయకులు నల్లప్ప, సావిత్రమ్మ, బాలరంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా రాణించండి



ఆంధ్ర పురుషుల సాఫ్ట్‌బాల్ జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: విజయమే లక్ష్యంగా క్రీడాకారులు రాణించాలని రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర సూచించారు. గురువారం స్థానిక అనంత క్రీడా గ్రామంలోని విన్సెంట్ క్రీడా మైదానంలో సీనియర్ సాఫ్ట్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో తలపడే రాష్ట్ర పురుషులు , మహిళల జట్ల కోచింగ్ క్యాంపు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. నాగేంద్ర మాట్లాడుతూ ఆర్డీటీ సహకారంతో క్రీడాకారులకు ఉత్తమ శిక్షణను ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర జట్టు ఈ నెల 5 నుంచి 9 వరకు ఒరిస్సాలోని పూరిలో జరిగే జాతీయ స్థాయిలో విజేతలుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ గ్రాస్ రూట్ లెవల్ కోఆర్డినేటర్ ఓబులేసు, సభ్యులు కేశవమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శంకరమఠం వార్షికోత్సం

అనంతపురం కల్చరల్: శ్రీశృంగేరి శారదా శంకర మఠం వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా ముగిశాయి. ఉదయం షోడశోపచార పూజలు, అభిషేకాల అనంతరం శ్రీగణపతి, రుద్ర, వాస్తు హోమాలను శాస్త్రోక్తంగా జరిపించి పూర్ణాహుతితో వేడుకలు ముగించారు. మఠం మేనేజర్ సత్యప్రసాద్ నేతృత్వంలో సాయంత్రం చంద్రమౌళీశ్వరుడి నిజరూప దర్శనానికి భక్తులు తరలివచ్చారు. మఠంలో కొలువైన గణపతి, శారదామాత, శంకర భగవత్పాదులు, చంద్రమౌళీశ్వరుడి విశిష్టతలను పండితులు ప్రవచనంలో వివరించారు.

జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. గత నెల 22 నుంచి 26 వరకు అనకాపల్లిలో జరిగిన జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో అమృత, సుప్రియ వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకాన్ని, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో వేణుచరణ్ స్వర్ణ పతకం సాధించారు. బాలికల టీమ్ ఛాంపియన్‌షిప్‌లో అమృత, సుప్రియ, రజినిల జట్టు కాంస్య పతకాన్ని, బాలుర టీం ఈవెంట్‌లో వేణుచరణ్ రజత పతకం సాధించారు. జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షులు సాల్మాన్ రాజ్, కోచ్‌లు ప్రకాష్, వలి, రంగస్వామి ప్రత్యేకంగా అభినందించారు.

'జీవనరేఖ'పై అవగాహన

రాప్తాడు రూరల్: పంట నష్టాలతో నిరాశ నిస్పృహకు లోనైన రైతులు ఆత్మహత్యల వైపు దృష్టి సారించకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన జీవనరేఖ కార్యక్రమంపై గురువారం అనంతపురం మండలం చియ్యేడు గ్రామ రైతులకు జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ అవగాహన కల్పించారు. ఆర్‌బీకేల వేదికగా రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సరైన సమయంలో సాంకేతిక సలహాలు అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించొచ్చన్నారు. సకాలంలో పంట రుణాలు చెల్లించే రైతులకు వైఎస్సార్ సున్నావడ్డీతో పంట రుణాలు ఇస్తోందన్నారు. రైతులపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అనంతరం జీవనరేఖ పోస్టర్లను ఆవిష్కరించారు. ఏడీఏ వెంకట్రాముడు, ఏఓ పి.వెంకటేశ్వర ప్రసాద్, ఏఈఓలు పాల్గొన్నారు.

సీనియర్ మహిళల క్రికెట్ జట్టుకు అనూష ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: సీనియర్ మహిళల క్రికెట్ జట్టుకు జిల్లాకు చెందిన బీ అనూష ఎంపికైంది. ఈ నెల 12 నుంచి 21 వరకు హైదరాబాద్ వేదికగా బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సీనియర్ మహిళల అంతర్ జోన్ల క్రికెట్ టోర్నీలో సీనియర్ మహిళల సౌత్‌జోన్ జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించనుంది. సౌత్‌జోన్ జట్టు వన్డే క్రికెట్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించనుంది. ఇటీవల బరోడాలో నిర్వహించిన సీనియర్ మహిళల వన్డే టోర్నీలో అద్భుతమైన బౌలింగ్‌తో తన ఆటతీరును ప్రదర్శించింది. జిల్లా నుంచి సౌత్‌జోన్ మహిళల జట్టుకు ఎంపికవ్వడం పట్ల ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, మధు, స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ అభినందించారు.

తల్లీకూతురు అదృశ్యం

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: నగరంలోని నాల్గో రోడ్డులో నివాసం ఉంటున్న తల్లీకూతురు అదృశ్యమయ్యారు. త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు వివరాల మేరకు.. నాల్గో రోడ్డులో తేజేశ్వని, ఆమె భర్త శ్రీకాంత్ నివాసం ఉంటున్నారు. వీరికి రూహా అనే కూతురు ఉంది. మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి నుంచి బయటకు కుమార్తెతో కలసి వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కుటుంబ సభ్యులు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎవరికైనా ఆచూకీ లభిస్తే సెల్: 9490618679లో సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు.

బడ్జెట్‌లో రైతులకు అన్యాయం

అనంతపురం అర్బన్: కేంద్ర ప్రభుత్వం ఈనెల 1న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ ఏపీ రైతు సంఘం నాయకులు స్థానిక సప్తగిరి సర్కిల్ వద్ద గురువారం నిరసన తెలియజేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు సీ2 ప్లస్ 50 ప్రకారం మద్దతు ధరలు ఇస్తామని ప్రధాని మోదీ ప్రకటించారని, బడ్జెట్‌లో ఆ ఊసే లేదన్నారు. నాయకులు బీహెచ్‌రాయుడు, నల్లప్ప, పోతులయ్య, నాగమ్మ, లక్ష్మీదేవి, సుభద్రమ్మ, చెన్నారెడ్డి, ఓబులేసు, రమేష్, చంద్ర, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మైనార్టీల విద్యకు అన్యాయం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మైనార్టీల విద్యకు అన్యాయం జరిగిందంటూ ఆవాజ్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపి బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలి, ముస్కిన్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మసూద్, ఇర్ఫాన్, బాబు, గఫూర్, శర్మాస్, సాదిక్ పాల్గొన్నారు.

ఉపాధి నిర్వీర్యానికి కుట్ర : ఉపాధి హామీ పథకం నిర్వీర్యానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ఆరోపించారు. పథకానికి బడ్జెట్ కేటాయింపు తగ్గించడం ఇందులో భాగమేనని అన్నారు. గురువారం కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపి బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూరి, కృష్ణమూర్తి, నాయకులు భాస్కర్, ఓబులేసు, మల్లేశ్, మున్ని, శంకర్, కరీం, చితంబరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

మహిళను కత్తితో బెదిరించి దోపిడీ

- రూ.4 లక్షలు ఎత్తుకెళ్లారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు
- ఘటనపై పోలీసులు అనుమానం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎ.నారాయణపురం ప్రధాన రహదారి నివాసం ఉన్న మున్నీ అనే మహిళను కత్తితో బెదిరించి రూ.4లక్షలు దోపిడీ చేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. నాల్గో పట్టణ ఇన్‌చార్జ్ సీఐ కత్తి శ్రీనివాసులు, బాధితులు తెలిపిన మేరకు.. కదిరికి చెందిన మున్నీ, బాబాఫక్రుద్దీన్ దంపతులు రెండేళ్ల క్రితం అనంతపురం వలస వచ్చారు. ఎ. నారాయణపురం గ్రామ ప్రధాన రహదారి పక్కనే ఓ ఇంట్లో అద్దెకుంటున్నారు. కదిరిలోని ఇంటిని రెండేళ్ల క్రితం రూ.12 లక్షలకు విక్రయించారు. కొంత మొత్తంతో కుమార్తె వివాహం జరిపించారు. మిగిలిన డబ్బుతో చీరలు వ్యాపారం చేస్తూ రూ. 4 లక్షలు ఇంట్లోనే దాచుకున్నారు. బాబాపక్రుద్దీన్ బేల్దారి పనికి వెళ్లాడు. బాబాఫక్రుద్దీన్ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చి వెళ్లాడు. సాయంత్రం 4 గంటల సమయంలో గుర్తు తెలియని ఓ మహిళ, మరో పురుషుడు చీరలు కావాలని అడిగారు. దీంతో వారిని ఆమె ఇంట్లోకి పిలిచింది. రెండు చీరలను ఎంపిక చేసుకొని రూ.2 వేల నోటు ఇచ్చారు. చిల్లర తీసుకురావడానికి మున్నీ లోపలి గదిలోకి వెళ్లింది. చీరల కోసం వచ్చినవారు ఆమెను కత్తితో బెదిరించి, బీరువాలో ఉన్న నగదు తీసుకొని అక్కడినుంచి ఉడాయించారు. బాధితురాలు స్థానికుల సహకారంతో నాల్గో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చింది. సీఐ కత్తి శ్రీనివాసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలించారు. ఘటనపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

శరవేగంగా నిర్మాణ పనులు

- ఒక్కో సచివాలయం పరిధిలో రూ. 20 లక్షలతో డ్రైన్లు, సీసీ రోడ్లు
- 9 సచివాలయాలకు రూ.1.80 కోట్లు మంజూరు



సోములదొడ్డిలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు

రాప్తాడురూరల్: ఇక్కడ కనిపిస్తున్న డ్రైనేజీ నిర్మాణం అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి గ్రామంలోనిది. ఎస్సీ, బీసీ కాలనీల్లో ఏళ్ల తరబడి డ్రైనేజీ వ్యవస్థ లేక తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఇటీవల 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం కింద ప్రతి సచివాలయానికి రూ. 20 లక్షల నిధులను ప్రభుత్వం కేటాయిస్తోంది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గ్రామంలో అత్యంత అవసరమైన బీసీ, ఎస్సీ కాలనీల్లో దాదాపు 1,300 మీటర్లు డ్రైనేజీల నిర్మాణం చేస్తున్నారు. వారం కిందట పనులు ప్రారంభమయ్యాయి. మరోవారం లోపు పనులు పూర్తవుతాయని సర్పంచ్ యర్రగుంట్ల లింగేశ్వరి తెలిపారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' నిధులతో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చకాచకా జరుగుతున్నాయి. మండల పరిధిలో మొత్తం 35 సచివాలయాలు ఉన్నాయి. అర్బన్ పరిధిలో 11, రూరల్ పరిధిలో 24 సచివాలయాలు ఉన్నాయి. ఇప్పటి దాకా గడప గడపకూ మన ప్రభుత్వం పూర్తయిన 9 సచివాలయాల్లో 41 పనులు మంజూరయ్యాయి. ఒక్కో సచివాలయానికి రూ. 20 లక్షలు చొప్పున రూ. కోటి 80 లక్షలు మంజూరయ్యాయి. అర్బన్ పరిధిలో 18, రూరల్ పరిధిలో 23 పనులు మంజూరుకాగా అర్బన్ పరిధిలో 10, రూరల్ పరిధిలో 8 పనులు పూర్తయ్యాయి. ఇంకా 23 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రత్యేక నిధులు కావడంతో బిల్లులకు ఎలాంటి ఇబ్బంది లేదు. పనులు పూర్తయిన వెంటనే బిల్లులవుతున్నాయి. దీంతో పనులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేస్తున్నారు. అధికారులు పర్యవేక్షిస్తూ నాణ్యత తగ్గకుండా చర్యలు తీసుకుంటున్నారు.

పనులపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి



'గడప గడపకూ మన ప్రభుత్వం' పూర్తయిన సచివాలయాల పరిధిలో అత్యవసరమైన పనులకు రూ. 20 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ఇప్పటిదాకా పూర్తయిన చోట్ల నిధులు మంజూరై పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ పనుల పురోగతిపై స్వయంగా కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు.

– బాబాఫక్రుద్దీన్, ఎంపీడీఓ, అనంతపురం

డ్రగ్ స్టోర్‌ను పరిశీలించిన సూపరింటెండెంట్

అనంతపురం సప్తగిరి సర్కిల్: సర్వజనాస్పత్రిలోని డ్రగ్ స్టోర్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ గురువారం తనిఖీ చేశారు. డ్రగ్ స్టోర్‌లోని మందులను ఆయన పరిశీలించారు. ఆర్ఎంఓ వైవీ రావు, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ సునీత, సిబ్బంది నరసింహారావు, ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఐఎల్ రిఫ్రిజిరేటర్ వితరణ : సర్వజనాస్పత్రిలోని సర్జికల్ విభాగానికి ప్రముఖ మానసిక వైద్యులు యండ్లూరి ప్రభాకర్ ఐస్ లైన్ రిఫ్రిజరేటర్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్‌కు గురువారం అందించారు.

మెరుగైన సేవలందించండి : రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సర్వజనాస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు తెలిపారు. స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని క్యాజువాలిటీ మెడికల్ విభాగాన్ని, ఏఎంసీ విభాగాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 రజిని పాల్గొన్నారు.

రూ.255 వచ్చేలా పని చేసుకోండి

ఆత్మకూరు: ఉపాధి కూలీలు కూలీ రూ.255 వచ్చేలా పనులు చేసుకోవాలని ఏపీఓ సుజాత తెలిపారు. గురువారం వడ్డుపల్లి వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ పరిశీలించారు. ఉదయం 6 గంటలకే పని చేసే ప్రదేశంలో ఉండి పనులు చేయాలన్నారు. ఎన్ఎమ్ఎమ్ఎస్ ద్వారా (సెల్‌ఫోన్) ద్వారా మేట్లు కూలీల ఫొటో తీసి కూలీల హాజరు వేస్తారని తెలిపారు.